ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024 5 అనంతపురం



రాయదుర్గంలో జాతీయ దర్యాప్తు సంస్థ సోదాలు

యువకుడిని అదుపులో తీసుకున్న ఎన్ఐఎ అధికారులు

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని ఓ ఇంటిలో జాతీయ దర్యాప్తు సంస్థ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) ఎన్ఐఎ అధికారులు మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు, సోదాలు నిర్వహించారు. పట్టణంలోని తహశీల్దార్ రోడ్ వేణుగోపాలస్వామి గుడి వీధిలో గల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా ఇంట్లో ఎన్ఐఎ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. అబ్దుల్లా పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సోహెల్ (33 సంవత్సరాలు) ను అదుపులో తీసుకొని విచారణ జరిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి అక్కడ విచారణ జరిపారు. అనంతరం ఆ యువకుడిని ఎన్ఐఎ అధికారులు బెంగళూరుకు తీసుకు వెళ్లినట్టు సమాచారం. ఎన్ఐఉ సోదాలు తనిఖీ విచారణ సందర్భంగా పోలీసులు అబ్దుల్లా ఇంటి సమీపంలోనూ, పోలీస్ స్టేషన్ వద్దకు ఎవరినీ రానివ్వలేదు. ఎటువంటి సమాచారం మీడియాకు వెల్లడించలేదు. సోహెల్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. వర్క్‌ఫ్రం హోం కారణంగా కొంతకాలంగా ఇంట్లోనే విధులు నిర్వహిస్తున్నారు. సోహెల్‌కు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనే సమాచారంతో ఎన్ఐఎ అధికారులు రాయదుర్గంలో తనిఖీలు చేశారు. యువకుడి ఫోన్‌కాల్ రికార్డు, డేటాను పరిశీలించినట్లు సమాచారం. అంతేకాక సోహెల్‌కు సంబంధించిన రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 28న సోహెల్‌కు పెళ్లి కాగా 29న అతని తండ్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చెందారు. సోహెల్ బెంగళూరులో ఉన్నప్పుడు ఉగ్రవాదులు అతని ఫోన్‌ను ఉపయోగించినట్లు సమాచారం. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ లో మార్చి మొదటి తేదీన భారీ పేలుడు సంభవించింది. ఈ సంఘటనపై విచారణను ఎన్ఐఎ తన చేతుల్లో తీసుకోగా ప్రధాన నిందితులను పశ్చిమ బెంగాల్లో అరెస్టు చేశారు. ప్రధాన నిందితుల విచారణలో సేకరించిన వివరాల ఆధారంగా ఎన్ఐఎ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే పేలుళ్ల ఘటనతో రాయదుర్గానికి చెందిన సోహెల్‌కు సంబంధం ఉందనే అనుమానంతో ఎన్ఐఎ అధికారులు విచారణ చేపట్టారు. బెంగళూరు, తమిళనాడులోని కోయంబత్తూర్ సహా దేశంలో 11 వేరువేరు ప్రాంతాల్లో ఎన్ఐఎ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. కోయంబత్తూర్‌లో నహీం, జాఫర్ ఇక్బాల్‌ను, ఇద్దరు వైద్యులను అరెస్టు చేశారు. రాయదుర్గంలో సోహెల్‌ను అదుపులో తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో రెండు గంటలసేపు విచారణ అనంతరం బెంగళూరుకు తరలించారు. రాయదుర్గంలో ఎన్ఐఎ అధికారుల దర్యాప్తు సంఘటన సంచలనం సృష్టించింది. దేశంలో ప్రధాన ఉగ్రవాద కార్యకలాపాలకు రాయదుర్గంలో కూడా సంబంధాలు ఉన్నాయన్న విషయం స్థానికులను ఉలికిపాటుకు గురి చేసింది



పోలీస్ స్టేషన్‌లో సోహెల్‌ను విచారిస్తుండగా బయట కాపలా ఉన్న పోలీసులు

వలస కార్మికుల బతుకులు దుర్భరం



వలస కార్మికుల నివాస ప్రాంతాలు

అమలుకు నోచని వలస కార్మిక చట్టం
కనీస సౌకర్యాలు కరువు
చాలీచాలని వేతనం
పట్టించుకోని కార్మిక శాఖ

ఉన్నచోట ఉపాధి లేక పొట్ట కూటి కోసం కడుపు చేత పట్టుకుని పనులకోసం వేల కిలోమీటర్లు వచ్చిన వలస కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయి. పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక శాఖ వారిని మరింత కష్టాల్లోకి నెట్టింది. రెక్కడితే గాని డొక్కాడని కార్మికులను కన్నీళ్ల పాలు చేస్తోంది. వలస కార్మికుల కోసం ఉన్నా వలస కార్మిక చట్టాన్ని (మైగ్రేషన్ యాక్టు) కార్మిక శాఖ యాజమాన్యాలకు తాకట్టు పెట్టింది. దీంతో హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళాపురం పారిశ్రామికవాడలలో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ప్రజాశక్తి హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామికవాడలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ప్రాంతంలో సండ్లపల్లి, తూముకుంట, గోళపురం, కొట్నూరు పారిశ్రామిక వాడలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 150 కి పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా ఫార్మా, స్టీల్ పరిశ్రమల్లో ఎక్కువ శాతం ఒరిస్సా, కలకత్తా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వలస కార్మికులు పొట్టకూటి కోసం ఈ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. కార్మిక చట్టం ప్రకారం కార్మిక శాఖ అధికారులు వలస కార్మిక చట్టాన్ని అనుసరించి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వివరాలన్నింటినీ సేకరించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో వలస కార్మిక చట్టం అమలు జరగడం లేదన్నది అక్షర సత్యం. వలస కార్మికులు ఎంతమంది ఏ పరిశ్రమలో పని చేస్తున్నారు, వాళ్ళు ఎక్కడ నివాసముంటున్నారు, వారికి వేతనం ఎంత ఇస్తున్నారు వివరాలు సైతం కార్మిక శాఖ వద్ద లేకపోవడం గమనార్హం. కార్మిక గుత్తేదారు నుంచి కార్మికులను దిగుమతి చేసుకొని ఆ కార్మికులకు కనీస మౌలిక సౌకర్యాలు సైతం కల్పించకుండా ఒకే గదిలో 5 నుంచి 10 మందిని ఉంచి వారి శ్రమను గుత్తేదారులు, పారిశ్రామిక వేత్తలు దోచుకుంటున్నారు. నిబంధనల మేరకు ఎనిమిది గంటల పని విధానం ఉంటే ఇక్కడ 12 గంటలు పనిచేస్తున్నారు. వీరికి వేతనాలు కూడా అంతంతమాత్రమే. విధులు నిర్వహిస్తే వేతనం లేదంటే లేదు. ఒక్క రోజు విధులకు హాజరు కాక పోయిన ఆ రోజు వేతనంలో కోత విధిస్తారు. కనీసం వీరు నివాసం ఉండడానికి అయినా మంచి గదులు కేటాయిస్తారా అంటే అదీ లేదు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు కేటాయించిన చిన్న గదుల్లో పదుల సంఖ్యలో వలస కార్మికులు బిక్కుబిక్కుమంటూ జీవనం చేయాల్సిన పరిస్థితి ఉంది. కనీసం స్నానం చేయడానికి స్నానపు గదులు సైతం లేవు. అరుబయట స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరి కొన్ని పరిశ్రమల వారు పరిశ్రమల లోపలే గదులను ఏర్పాటు చేసి వారిని ఖైదీల కన్నా హీనంగా చూస్తున్నారు. ఈ ప్రాంతంలో వలస కార్మికులు ఇంత దుర్భరంగా జీవిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ మాత్రం నిద్ర మత్తులో నుంచి బయటకు రావడం లేదు. జిల్లాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ ఉన్న హిందూపురంలో జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాల్సి ఉన్నప్పటికి జిల్లా అధికారి జిల్లా కేంద్రానికే పరిమితం అయ్యారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఎప్పటికప్పుడు పరిశ్రమలపై తనఖీలు నిర్వహించి, వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి. వలస కార్మికుల వివరాలను సేకరించి, వారికి కార్మిక చట్టం ప్రకారం అందాల్సిన సౌకర్యాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యతకార్మిక శాఖ అధికారులపై ఉంది. అయితే కార్మిక శాఖ అధికారులు ఎవరు ఇటువైపు చూడకపోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయి. వీరు పడుతున్న బాధలను ఎవరికి చెప్పాలో తెలియక, బయటకు చెబితే యాజమాన్యాలు ఉద్యోగంలో నుంచి తీసి వేస్తాయన్న భయంతో కనీస సౌకర్యాలు లేక పోయినా అక్కడే జీవనం చేస్తున్నారు.

వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి



తూముకుంట, గోళపురం పారిశ్రామికవాడలో కార్మిక శాఖ వెంటనే వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, కార్మికుల వివరాలను సేకరించాలి. వలస కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో వలస కార్మిక సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

ఇఎస్ వెంకటేష్
సిఐటియు జిల్లా కార్యదర్శి

నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి



తూమకుంట, గోళపురం పారిశ్రామికవాడలో ఉన్న స్టీల్, ఫార్మా, వీర్గో పరిశ్రమలో పని చేస్తున్న వలస కార్మికుల నివాస ప్రాంతాలలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వారి నివాస స్థలాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. ప్రతి నెల ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి.

రవికుమార్,
టిలా అధ్యక్షులు



వలస కార్మికులు నివాసం ఉండే ప్రాంతం



తమ ఇబ్బందులు వివరిస్తున్న వలస కార్మికులు



ప్రజాసంఘాల్లోకి చేరిన వారితో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజల పక్షాన పోరాడుదాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గార్లదిన్నె

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజల పక్షాన పోరాటాలు ఉధృతం చేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని కల్లూరు, కల్లూరు అగ్రహారం, కొప్పలకొండ గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన 40 మంది సిపిఎం అనుబంధ సంఘాల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, వైసిపిలకు చెందిన కార్యకర్తలు ఆయా పార్టీల విధానాలపై విసుగు చెంది సిపిఎం అనుబంధ సంఘాల్లో చేరడం సంతోషకరమన్నారు. పేదల కోసం సిపిఎం చేస్తున్న పోరాటాలపై ఆసక్తితో చేరారని వివరించారు. గార్లదిన్నె మండలంలో సిపిఎంని బలోపేతం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు నాగరాజు, మండల కార్యదర్శి చిన్నారెడ్డి, పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

పుట్టపర్తి క్రైమ్ : బీటెక్ పరీక్షలలో ఫెయిల్ అయినందుకు మనస్థాపం చెంది విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్టపర్తి మండలంలో చోటుచేసుకుంది. విద్యార్థి బంధువులు తెలిపిన మేరకు వివరాలు... మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లికి చెందిన ఆనంద్ కుమారుడు గౌతమ్ (22) అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. చివరి సంవత్సరం పరీక్షలలో ఏడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. సప్లమెంటరీ పరీక్షలు రాసినప్పటికీ పాస్ కాకపోవడంతో మనస్తాపం చెందిన గౌతమ్ మంగళవారం తమ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇద్దరు ఆడపిల్లల నడుమ పుట్టిన కొడుకు మృతి చెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.



గౌతమ్ (ఫైల్‌ఫొటో)

48 గంటల్లోగా ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా పోలింగ్ రోజు, తర్వాత వచ్చిన ఫిర్యాదులను 48 గంటల్లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా ఫిర్యాదులు, కౌంటింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలలో వచ్చిన ఫిర్యాదులను రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసుకుని సరైన ఎండార్స్‌మెంట్ ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోలింగ్ రోజు, తర్వాత చాలా ఫిర్యాదులు వచ్చాయని, వెంటనే వాటికి పరిష్కారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందులో పోలీస్ శాఖకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని వాటి పరిష్కారానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒక టీంను కేటాయించాలని అన్నారు.

కౌంటింగ్ కోసం జిల్లాకు ముగ్గురు పరిశీలకులు : సాధారణ ఎన్నికల కౌంటింగ్ కోసం ఎన్నికల కమిషన్ జిల్లాకు ముగ్గురు పరిశీలకులను నియమించిందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం అర్బన్, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల పరిశీలకులుగా మనీష్ సింగ్, ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల అసెంబ్లీ నియోజకవర్గాలకి సంబంధించి ఎన్నికల పరిశీలకులుగా సి.అజయ్ నాథ్, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అజయ్ కుమార్‌ను కౌంటింగ్ అబ్జర్వర్లుగా నియమించడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, అధికారులంతా విధులను బాధ్యతగా నిర్వహించాలని చెప్పారు. రిటర్నింగ్ అధికారులు రోజుకు రెండుసార్లు జేఎన్టీయూలోని స్ట్రాంగ్ రూములను పరిశీలించి రిపోర్టులను అందించాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద 4 దిక్కులు కనిపించే విధంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు రాణిసుస్మిత, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నియామకం

సాధారణ ఎన్నికలలో భాగంగా నగరంలోని జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్ద సెక్టార్ అధికారులను స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లుగా నియమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 (సెంట్రల్ యాక్ట్ 2, 1974)లోని సెక్షన్ 21 కింద జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద 24/7 సెక్టార్ అధికారులను స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లుగా నియమించామన్నారు. మూడు షిఫ్ట్ లలో ముగ్గురు సెక్టోరియల్ అధికారులను నియమించడం జరిగిందని చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హెచ్ఎన్ఎస్ఎస్ డీఈఈ డబ్ల్యూ. రాఘవేంద్రరావును, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డీఈఈ సుభాష్ చంద్రబోస్‌ను, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అహుడా డీఈఈ రేవంత్‌ను నియమించడం జరిగిందన్నారు. ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌గా సెక్టార్ అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు.

నిబంధనలకు నీళ్లు!

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు - విచ్చలవిడిగా బ్లాస్టింగులు
కంకర క్వారీల్లో కనీస సౌకర్యాలు కరువు
ప్రమాదకర పనుల్లో కార్మికులు



కంకర మిషన్

ఎప్పుడు పడితే అప్పుడు విచ్చలవిడిగా బ్లాస్టింగులు.. భారీ శబ్దాలు.. ఎగిరి పడుతున్న రాళ్లు.. ప్రాణాలు కోల్పోతున్న మూగజీవాలు.. రైతులకు తిప్పలు.. ఎక్కడా అమలు కాని నిబంధనలు.. కార్మికులతో ప్రమాదకర పనులు.. ఈ పనుల్లో ప్రాణాలూ కోల్పోవచ్చు... అంగవైకల్యం భారిన పడవచ్చు.. ఇవీ కంకర మిషన్లు, కంకర క్వారీల్లో జరుగుతున్న తీరు...

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని నెమకల్ రెవెన్యూ పరిధిలో 22 కంకర మిషన్లు, 60 కంకర క్వారీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా కంకర క్వారీల్లో బ్లాస్టింగ్ మూడు మీటర్ల కంటే లోతు వేయరాదు. అంతేగాకుండా వారానికి మూడుసార్లు మాత్రమే బ్లాస్టింగ్ చేయాలి. అదికూడా కేవలం సాయంకాలం 6గంటల తర్వాతే బ్లాస్టింగ్ చేయాలి. బ్లాస్టింగ్ చేసే మునుపు ఎక్కడైతే బ్లాస్టింగ్ చేస్తారో.. అక్కడ మ్యాట్ వేసి శబ్దం రాకుండా.. పేలుళ్ల కంకర రాళ్లు పైకి ఎగరకుండా నిబంధనలు పాటించాలి. వీటితోపాటు కార్మికులకు ప్రమాదాలు జరగకుండా తలకు హెల్మెట్, కాళ్లకు బూట్లు, చేతులకు తొడుగులను అందజేయాలి.

అయితే ప్రభుత్వ నిబంధనలను ఎక్కడా పాటించడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి 50 అడుగుల వరకూ బోర్ బ్లాస్టింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు మ్యాట్ వినియోగించుకోకుండా బ్లాసింగ్ చేయడం వల్ల సమీప పొలాల్లో పని చేసే రైతులు, మేతకు వెళ్లే పశువులు, వన్నె ప్రాణులు కోల్పోవాల్సి వసోంది. కార్మికులకు హెల్మెట్లు, కాళ్లకు బూట్లు, చేతులకు తొడుగులు ఇవ్వకపోవడం వల్ల ప్రమాదాల గురై కొంతమంది కార్మికులు కాళ్లు, చేతులు కోల్పోయి అంగవైకల్యానికి గురవుతున్నారు. మరోవైపు ప్రతి కార్మికుడికీ కనీస వేతనంతోపాటు పిఎఫ్, ప్రమాద బీమా ఇవ్వాల్సి ఉంది. అలాంటివేవీ అమలు చేయకుండా కంకర క్వారీలు నడపతుండటం గమనార్హం. ఆయా సౌకర్యాలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు నిరాశ్రయులు అవుతున్నారు. వీటన్నింటినీ పరిశీలించాల్సిన మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రచారం మైన్స్ అండ్ జియాలజీ అధికారులు ప్రతి ఆరునెలలకు ఓసారి తప్పనిసరిగా క్వారీలను పరిశీలించాలి. అధికారులు పరిశీలనకు వచ్చినప్పుడు ఆయా క్వారీలు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తున్నాయా.. కార్మికులకు సౌకర్యాలు కల్పిస్తున్నారా..లేదా పరిశీలించి ఒకవేళ నిబంధనలు పాటించకపోతే జరిమాని విధించాలి. అప్పటికీ వినకపోతే సీజ్ చేయాలి. కానీ ఎక్కడా ఇలా చేయడం లేదు. ఇప్పటికైనా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు స్పందించి ఆయా కంకర మిషన్లు, కంకర క్వారీలను తరచూ తనిఖీ చేసి కార్మికులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్లాసింగులు చేయాలని పరిసరాల రైతులు విన్నవిస్తున్నారు.



బూట్లు లేకుండా చెప్పులతో పని చేస్తున్న కార్మికుడు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ వినోద్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం విజయవాడ వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, లా అండ్ ఆర్డర్, తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో డే గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. సీపీడబ్ల్యూ పథకాల కింద పలు గ్రామాలకు నీటి సరఫరా పునరుద్ధరిస్తున్నామన్నారు. అవసరమైన చోట అదనపు బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ పివిఎస్‌ఎన్ మూర్తి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇ సురేంద్ర, సిపిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ హసన్‌బాషా, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, పబ్లిక్ హెల్త్ ఇఇ సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనకాయలు సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ




విత్తనకాయలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-గుత్తి

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తన వేరుశెనగ కాయలనే అందజేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని పారిశ్రామిక వాడలో ఉన్న పవన్ ఆగ్రో ఏజెన్సీ వేరుశెనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వేరుశెనగ నిల్వలు, రికార్డులను పరిశీలించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ నాసిరకం విత్తనాలను వేరుచేసి నాణ్యమైన విత్తనాలను రైతులకు ఇవ్వాలన్నారు. విత్తన సరఫరా లో జాప్యం చేస్తే చర్యలు చేపడతామన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా 40 శాతం రాయితీతో రైతులకు వేరుశెనగ విత్తనాలను అందజేస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం అగ్రి ల్యాబ్‌ను పరిశీలించి అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఎం.వెంకటరాముడు, సాంకేతిక సహాయకులు రాకేష్ నాయక్, మెహరున్నీషా, గుత్తి వ్యవసాయ అధికారి ముస్తాక్‌అహ్మద్, పవన్ ఆగ్రో ఏజెన్సీ వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ యజమాని బయపరెడ్డి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ



అనంతపురంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ సూచించారు. ఎస్పీ గౌతమిశాలి ఆదేశాలతో మంగళవారం నగరంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక క్లాక్‌టవర్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ సుభాష్ రోడ్డు, సప్తగిరి సర్కిల్, సూర్యానగర్ సర్కిల్, బసవన్నకట్ట, గాంధీబజార్, తాడిపత్రి బస్టాండు, తిలక్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకూ కొనసాగింది. ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు కొనసాగింది. ఏవైనా సమస్యలుంటే ఆయా స్థానిక పోలీసుల దృష్టికి తీసికెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని కోరారు. ఎన్నికలు ముగిశాయి.. త్వరలోనే కౌంటింగు ప్రక్రియ జరుగనున్న ఈనేపథ్యంలో ఎవరూ గొడవలు, అల్లర్లు జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించి పోలీసులతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐలు రెడ్డెప్ప, ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు, తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై నారసింహుడు



సింహవాహనంపై ఊరేగుతున్న నరసింహస్వామి

రాయదుర్గం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాయదుర్గంలోని కోటలో వెలసి ఉన్న ప్రసన్న వెంకటరమణ స్వామి మంగళవారం సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి వినాయక కూడలి మీదుగా నేసే పేటలోని భక్త మార్కండేయ స్వామి ఆలయం వరకూ సింహ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు, యాదవ, కురుబ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ నాణ్యత పరిశీలన



విత్తనకాయలను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు : మండల పరిధిలోని వేపచెర్ల, బియాలేరు, సనప రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ నమోదు కార్యక్రమాన్ని జి సుచరిత, మండల వ్యవసాయ అధికారి, పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించారు. వేరుశెనగ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సకాలంలో విత్తన కాయలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సుజిత, ఆర్‌బికె సిబ్బంది శిల్ప, ఆశు, రూపేష్, రైతులు పాల్గొన్నారు.

డిఇఇ జివి.రాజ్‌కుమార్ హఠాన్మరణం



మృతిచెందిన డిఇఇ రాజ్‌కుమార్ (ఇన్‌సెట్‌లో) పాతచిత్రం

ప్రజాశక్తి-గుత్తి

ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గుత్తి మండల ఎన్నికల నోడల్ అధికారి జీవి.రాజ్ కుమార్(53) మంగళవారం హఠాన్మరణం చెందారు. రెండు రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పారు. కుటుంబ సభ్యులు అనంతపురం నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందారు. ఈయన స్వస్థలం కడప. అయితే ఉద్యోగ రీత్యా అనంతపురంలో స్థిరపడ్డారు. డిఇఇ మరణవార్త విన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ హసాన్‌బాషా, ఇఇ జవహర్ బాషా, జిల్లాలోని డిఇఇలు, ఎఇఇలు, జెటిఒలు, సిబ్బంది అనంతపురంలోని డిఇఇ స్వగ్రాహానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట భద్రత

ఎస్పీ గౌతమిశాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ గౌతమిశాలి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని రాప్తాడు, ఇటుకలపల్లి పోలీసు స్టేషన్లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యాత్మక గ్రామాలు, అక్కడి తాజా పరిస్థితులపై ఆరాతీశారు. ఇంకా ఎవరినైనా బౌండోవర్ చేయాల్సి ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. క్రిటికల్ గ్రామాలను తరుచూ సందర్శించి సమస్యలు ఉత్పన్నం కాకుండా, గ్రామాలలో ప్రశాంతత లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్ పెట్రోలింగ్‌లు, గ్రామసభలు, కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కౌంటింగు, తర్వాత కూడా గ్రామాల్లో హింసకు తావులేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ రాప్తాడు, ఇటుకలపల్లి సి.ఐలు మునిస్వామి, నరేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గడ్డివాములను తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లావ్యాప్తంగా కార్డెన్ సెర్చ్‌లు

ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు మంగళవారం కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా స్టేషన్ల సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, కర్నాటక మద్యం, నాటుసారా, గుట్కా నియంత్రణ వంటి పాత కేసుల్లో ఉన్న నిందితుల ఇళ్లు, పశువుల పాకలు, గడ్డివాముల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలను లోతుగా పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ చేశారు. అనంతరం గ్రామసభలు ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్, తర్వాత కూడి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఎలాంటి అల్లర్లకు వెళ్లకూడదని కోరారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాళ్లు, కర్రలు, మారణాయుధాలు వినియోగిస్తే చర్యలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు నిర్మాణ సామాగ్రి అయిన రాళ్లు, కర్రలు, ఇతర వస్తువులను అక్రమార్కులు అనధికారికంగా వినియోగించకుండా సిఆర్‌పిసి సెక్షన్ 133(1) కింద జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశాలు జారీ చేశారు. జరిగింది. రాళ్లు, కర్రలు, రాడ్స్, ఇతర వస్తువులు చట్టపరమైన నిర్మాణ పనులకు మాత్రమే ఉపయోగించాలని, ఇది గనులు, భవన యజమానులకు వ్యక్తిగతమైన బాధ్యత అని అన్నారు. వ్యాపారపరంగా ఎటువంటి వాటికి రాళ్లు, కర్రలు, ఇతర వస్తువులను తరలించరాదన్నారు. ఎక్కడికైనా వాటిని పంపించినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా అది చట్టపరమైన పనులకు మాత్రమే వినియోగించాలని, అది గనులు, భవన యజమానుల బాధ్యత అని అన్నారు. పనులు చేసే కార్మికులను కూడా నిర్మాణ పనులకు మాత్రమే తీసుకోవాలని, వారు ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనకుండా చూడాలని అన్నారు. పనులకు వచ్చేవారు ఎటువంటి క్రిమినల్ యాక్టివిటీలలో పాల్గొనకూడదని, లా అండ్ ఆర్డర్ కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని చెప్పారు.

వర్షాలొస్తున్నాయి.. ప్రజలకు అందుబాటులో ఉందాం..

పార్టీ నేతలతో టిడిపి అభ్యర్థి 'దగ్గుపాటి'



సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'అనంతపురంలో వర్షాలు బాగా వస్తున్నాయి.. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎలాంటి సమయంలోనైనా అండగా నిలవండి..' అంటూ అనంతపురం అర్బన్ టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ పార్టీ నాయకులకు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలో కురిసిన భారీ వర్షానికి ఎక్కడెక్కడ నష్టం జరిగింది.. ప్రజలు ఇబ్బందులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో వర్షాలకు డ్రెయినేజీలు రోడ్లపై పొంగిపొర్లి ఇళ్లలోకి నీరు వస్తోందన్నారు. ఇలాంటి సమయంలో మనం వారికి అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపి నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వస్తారని, ఆ తర్వాత వారికి ఏదైనా కష్టం వస్తే కనిపించరన్నారు. ఇలాంటి సమయంలో మనమే వారికి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా కాలువల్లో పూడిక పేరుకుపోయి ఉన్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్నచోట ముందే గుర్తించాలన్నారు. మరో 15 రోజుల్లో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. కచ్చితంగా చంద్రబాబు సహకారంతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తీసుకురావడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షాలు వచ్చినప్పుడు ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు కొండవీటి సుధాకర్ నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీ నరసింహులు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, మాజీ కార్పొరేటర్ రాజారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు గోపాల్‌గౌడ్, వన్నూరప్ప, నాయకులు ఐఎం.బాషా, గోళ్ల సుధాకర్‌నాయుడు, హరి, లక్ష్మీనారాయణరెడ్డి, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి : మేయర్



పారిశుద్ధ్యం పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో ఎక్కడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా దృష్టి సారించాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. సోమవారం రాత్రి నగరంలో కురిసిన వర్షాలకు పలుప్రాంతాల్లో చెట్లు కూలిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతోపాటు పారిశుధ్య సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న మేయర్ మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతంగా కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలన్నారు. డ్రెయినేజీల్లో ఎలాంటి ఆటంకం లేకుండా వర్షంనీరు ప్రవహించేలా ఎప్పటికప్పుడు పూడికతీతతో పాటు చెత్తాచెదారం తొలగించాలని సచివాలయాల శానిటరీ సెక్రటరీలను ఆదేశించారు. చెట్ల తొలగింపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శేఖర్‌బాబు, కమల్‌భూషణ్, చంద్రమోహన్‌రెడ్డి, మునిశేఖర్, లాలూ, నాయకులు రామచంద్ర, శీనా, తదితరులు పాల్గొన్నారు.

పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

భక్తి శ్రద్ధలతో ధ్వజారోహణం




ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ మండలం పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ సందర్భంగాఉదయం 'గరుడ పట ధ్వజారోహణ' కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ప్రధాన ఆలయంలోని స్వామివారి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం గరుడపటాన్ని మేళతాళాలతో, మంగళవాయిద్యాలు నడుమ వేద మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవమూర్తుల సాక్షిగా ఆలయ ధ్వజస్తంభంపై ఎగురవేశారు. శ్రీమహావిష్ణువునకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు సకల దేవతలు, మానవజాతికి తెలిపేలా గరుడపటాన్ని ఎవురవేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారాకనాథ్, మయూరం బాలాజీస్వామి, గుండురావుస్వామి, ఆలయ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రథం ట్రయల్ రన్ విజయవంతం

పెన్నఅహోబిలం లక్ష్మీన రసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహణ కోసం నిర్వహించిన పాత రథం ట్రయల్ రన్ మంగళవారం విజయవంతంగా ముగిసింది. గతేడాది కొన్ని పొరపాట్లు కారణంగా రథం కిందకు పడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో రథానికి మరమ్మతులు చేశారు. ఈనెల 28న జరిగే స్వామివారి రథోత్సవం నాటికి రథం సిద్ధం చేయడంతో భాగంగా ట్రయల్ రన్ నిర్వహించారు. ముందుగా పాత రథానికి ఆలయ ఇఒ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు ద్వారాకనాథ్, బాలాజీ స్వామి ప్రత్యేక పూజలు చేసి దేవస్థానం సిబ్బంది భక్తుల చేత తాడుతో కొంతదూరం లాగించారు. అనంతరం ట్రాక్టర్, పొక్లెయిన్‌కు తాడుతో రథానికి కట్టి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ట్రయల్ రన్ విజయవంతం అయినట్లు తెలిపారు. రథోత్సవం నిర్వహణ కోసం అనేక జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, ఆర్‌అండ్‌బి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు, అర్చకులు

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతిచెందిన పోతులయ్య

నార్పల : ఇంట్లో మచ్చు కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి సోమవారం పాల్పడిన మండల కేంద్రంలోని దుగుమర్రి రోడ్డులో చర్చి సమీపంలో నివాసం ఉండే పోతులయ్య (54) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. భార్య ఆదిలక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. పోతులయ్య తన భార్యతోపాటు కొడుకు, కోడలితో దుగుమర్రి రోడ్డులో నిర్మాణంలో ఉన్న కళ్యాణ మండపంలో కూలి పని చేసుకుని జీవనం సాగించేవారు. అయితే మద్యానికి బానిసైన పోతులయ్య రోజూ మద్యం తాగి వచ్చి విచక్షణ కోల్పోయి ప్రవర్తించేవాడు. ఈనేపథ్యంలో సోమవారం కూడా మద్యం తాగి తమను దుర్భాషలాడాడన్నారు. దీంతో తాము ఇంట్లో నుంచి బయటకు వచ్చామన్నారు. అంతలోనే ఇంట్లో ఉన్న మచ్చు కత్తితో గొంతు కోస్తున్నాడన్నారు. దీనికితోడు అంతకుముందే పైపులను అతికించే సొల్యూషన్ కూడా తాగాడన్నారు. వెంటనే 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని వన్నెదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వన్నెదొడ్డికి చెందిన నరసింహులు గ్రామం నుంచి గుత్తికి కారులో వస్తుండగా హైవేపై హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరసింహులు ను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కేబుల్ చోరీ

పుట్లూరు : మండలంలోని చింతకుంట గ్రామంలో రైతు వెంకటశివారెడ్డికి చెందిన రెండు మోటార్ల కేబుల్ వైర్ సోమవారం రాత్రి చోరీకి గురైంది. మంగళవారం మధ్యాహ్నం తోటకు వెళ్లిన రైతు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ దాదాపు 150 మీటర్లు కేబుల్ చోరీకి గురైందన్నారు. దీంతో సుమారు రూ.25వేల వరకూ నష్టం వాటిల్లిందన్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

గుత్తి : పట్టణంలోని సత్రం మిట్ట వద్ద మంగళవారం రాత్రి ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. సెంట్రల్ లైటింగ్ సిస్టం లో భాగంగా పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ మధ్యలో మున్సిపల్ అధికారులు విద్యుత్ అలంకరణ స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే గాంధీ కూడలి వైపు నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళుతున్న లారీ సత్రం మిట్ట సమీపంలో ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ స్తంభం విరిగి అవతల వైపు ఒరిగి కింద పడింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు అక్కడి నుంచి విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రశాంత జీవనం సాగించాలి

పుట్లూరు : గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సిఐ సూచించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని ఎస్.గూడూరులో ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరూ అనవసరంగా గొడవలు జోలికి వెళ్లకూడదన్నారు. ఏమన్నా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలా కాకుండా గొడవలకు వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఎన్నికల కౌంటింగ్ అయిపోయిన తర్వాత కూడా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారసింహుని జయంతి

రాయదుర్గం రూరల్ : నరసింహస్వామి జయంతి సందర్భంగా మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలిసిన విప్లమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం లక్ష తులసీఅర్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రామ్మూర్తి స్వామి, ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంల స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకుల పూజ, నైవేద్య పూజలు చేశారు. దంపతులు సామూహికంగా లక్ష తులసీఅర్చన చేశారు. మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుల ధర్మన్న, కోశాధికారి నరసింహులు, ఉప కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర, సభ్యులు గురునాథరెడ్డి, కమలాక్షుడు, రామ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, తిప్పేస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత పెంచాలి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇవిఎంలను ఉంచిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత మరింత పెంచాలని టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక టిడిపి నాయకులతో కలిసి జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్దకు వెళ్లి అక్కడ సీసీ కెమెరాలన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ ప్రస్తుతం ఉన్న భద్రత కన్నా ఇంకా ఎక్కువగా పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వైసిపి అసాంఘిక శక్తులు చేస్తున్న అరాచక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని భద్రత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, గాజుల ఆదెన్న, జయరామ్‌నాయుడు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న దగ్గుపాటి ప్రసాద్